

టన్ను చీనీ రూ.18 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.18 వేలు పలికాయి. మార్కెట్‌కు 944 టన్నుల చీనీకాయలు వచ్చాయి.



నైరుతి నైరాశ్యం

రైతుల ఆశలు పండించాల్సిన నైరుతి నైరాశ్యం మిగిల్చింది. కీలకమైన సమయంలో వరుణుడు ముఖం చాటేయగా ఖరీఫ్ పంటల సాగు ప్రశ్నార్థకంగా మారింది. 8లో

గరిష్టం/కనిష్టం
37.6°/22.4°

జిల్లాలో శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత అధికమైంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి.

న్యూస్‌రీల్

టీబీ డ్యాంలో 29 టీఎంసీల నీరు




బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయం నీటితో కళకళలాడుతోంది. కొద్ది రోజులుగా ఇన్‌ఫ్లో హెచ్చుతగ్గుల మధ్య కొనసాగుతోంది. శుక్రవారం ఉదయానికి 21,643 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 205 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదైంది. ప్రస్తుతం 105.788 టీఎంసీల పూర్తి మట్టానికి గాను 29.161 టీఎంసీల వరకు నీరు నిల్వ ఉంది. ఎగువన శివమొగ్గ, శృంగేరి, తీర్థనహళ్లి, ఆగుంబే తదితర ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో తుంగభద్రకు వరద నీరు కొనసాగుతోంది.

14న హ్యాండ్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

కదిరి అర్బన్: స్థానిక ఎస్టీఎస్‌ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 14న హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక ఉంటుందని జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిభ చూపిన వారితో జిల్లా బాలురు, బాలికల జట్లను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికెట్ తీసుకురావాలని సూచించారు. పూర్తి వివరాలకు 9704140510, 7680880269 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రేపటి నుంచి సత్యసాయి జాతీయ క్రికెట్ లీగ్



సత్యసాయి జాతీయ క్రికెట్ లీగ్ ట్రోఫీ

ప్రశాంతి నిలయం: సత్యసాయి సంస్థల్లో పనిచేసే యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకు నిర్వహించే జాతీయ స్థాయి క్రికెట్ లీగ్ పోటీలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఏడాది పాటు ఏడు దశల్లో నిర్వహించనున్న పోటీల ప్రారంభ కార్యక్రమం ఆదివారం ఉదయం పుట్టపర్తిలోని హిల్‌వ్యూ స్టేడియంలో జరగనుంది. ప్రారంభ మ్యాచ్ భారత్ లెవన్స్, గ్లోబల్ లెవెన్స్ మధ్య జరగనుంది. భారత మాజీ క్రికెటర్ మురళీ కార్తీక్, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ప్రతినిధులతో కలిసి మ్యాచ్‌ను ప్రారంభించనున్నారు.

ఏడు దశలు.. ఏడాది పాటు..

సత్యసాయి జాతీయ క్రికెట్ లీగ్ మ్యాచ్‌లు ఏడు దశల్లో... ఏడాది పాటు జరగనున్నాయి. తొలుత సత్యసాయి సమితి స్థాయిలో, ఆ తర్వాత ఇంటర్ సమితి, జిల్లా, ఇంటర్ డిస్ట్రిక్ట్, ఇంటర్ స్టేట్, జోనల్, అంతిమంగా జాతీయ స్థాయిలో మ్యాచ్‌లు జరగనున్నాయి. ఫైనల్ మ్యాచ్ 2025 జూలై 14న పుట్టపర్తిలోని సత్యసాయి హిల్‌వ్యూ స్టేడియంలో జరగనుంది. సమితి స్థాయిలో జరిగే మ్యాచ్‌లను ఆయా ప్రాంతాల్లోని పాఠశాల, కళాశాలల మైదానాల్లో నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు 18 - 35 ఏళ్ల మధ్య వయస్సు కలిగి, సత్యసాయి సేవా సమితుల్లో క్రియాశీలకంగా వ్యవహరించే వారే అర్హులని నిర్వాహకులు తెలిపారు.

'ఉచిత ఇసుక' పక్కాగా అమలు కావాలి

- అధికారులకు జేసీ ఆదేశం



ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ముదిగుబ్బ/ తాడిమర్రి: ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుక పాలసీ పక్కాగా అమలు కావాలని, ఎవరైనా అక్రమాలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన ముదిగుబ్బ మండలంలోని ఉప్పలపాడు, తాడిమర్రి మండలంలోని చిన్నచిగుళ్లరేవు ఇసుక డీ–సిల్టేషన్ పాయింట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో ఉచిత ఇసుక సరఫరా తీరు గురించి తెలుసుకున్నారు. ఇసుక రవాణాకు కచ్చితంగా అనుమతులు ఉండాలన్నారు. ఎట్టిపరిస్థితుల్లోను నగదు తీసుకోకుండా కేవలం ఆన్‌లైన్‌లో మాత్రమే డబ్బులు తీసుకోవాలని ఆయన సూచించారు. అలాగే ఇసుక రీచ్‌లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జేసీ వెంట గనుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రామ్మోహన్, ధర్మవరం ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డి, తహసీల్దార్ నజియా భాను, ఇరిగేషన్ అధికారులు ఉన్నారు.

రైల్వేలైన్‌కు గ్రహణం

రాయదుర్గం–తుమకూరు రైల్వే లైన్... రెండు రాష్ట్రాలను కలిపే రైల్వే ప్రాజెక్టు. ఈ ప్రాజెక్టుకు భూమి పూజ జరిగి ఇప్పటికి 13 ఏళ్లయినా పట్టాలు పూర్తి స్థాయిలో పరుచుకోలేదు. దీంతో రాష్ట్ర సరిహద్దు వాసులు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. 2011లో ప్రారంభమైన బ్రాడ్‌గేజ్ పనులు నేటికీ కొనసాగుతూనే ఉన్నాయి. రాష్ట్రంలో గత సీఎం వైఎస్ జగన్ చొరవ చూపడంతో దాదాపు 63 కి.మీ పనులు పూర్తయ్యాయి. కానీ కర్ణాటక ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో భూసేకరణ కూడా పూర్తి కాలేదు.

- రాయదుర్గం–తుమకూరు రైల్వే లైన్ పనులకు గ్రహణం
- ప్రారంభించి 13 ఏళ్లయినా పూర్తి కాని వైనం
- ఇప్పటివరకూ కదిరిదేవరపల్లి వరకు మాత్రమే పూర్తి
- ప్రస్తుతం పావగడ–మడకశిర మధ్య జరుగుతున్న పనులు
- కర్ణాటకలో ఇంకా పూర్తి కాని భూసేకరణ



రాయదుర్గం–తుమకూరు రైల్వే లైన్

మడకశిర: రాష్ట్ర సరిహద్దులో ఉన్న మడకశిర నియోజకవర్గ వాసులంతా ఏ పని ఉన్నా సమీపంలోని మధుగిరి, తుమకూరుకు వెళ్తుంటారు. కానీ సరైన రవాణా సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మడకశిర వాసులకు ఇప్పటికీ రైలు ఎక్కే యోగం కలగలేదు. 2011లో రాయదుర్గం–తుమకూరు మధ్య బ్రాడ్‌గేజ్ రైల్వే లైన్ వేసేందుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వగా ఎంతో సంతోష పడ్డారు. త్వరలోనే ఎంచక్కా రైలులో తుమకూరు వెళ్లవచ్చని ఆశపడ్డారు. కానీ 13 ఏళ్లుగా వారి కల నెరవేరలేదు. ప్రస్తుతం తుమకూరు పార్లమెంట్ స్థానం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న సోమన్న కేంద్రంలో రైల్వేశాఖ, జలవనరుల శాఖ సహాయ మంత్రిగా ఉండటంతో ఈ రైల్వే ప్రాజెక్టుకు ఇప్పటికైనా మోక్షం కలుగుతుందని అంతా భావిస్తున్నారు.

రాయదుర్గం–తుమకూరు రైల్వే లైన్ నిర్మాణ స్వరూపం ఇలా....	
రైల్వే నిర్మాణం పొడవు	207 కి.మీ
రైల్వే లైన్ నిర్మాణానికి భూమి పూజ	2011
బ్రాడ్‌గేజ్ ప్రాజెక్ట్ అంచనా	రూ.857.31 కోట్లు
ఏపీలో రైల్వేలైన్ పొడవు	94 కి.మీ
కర్ణాటకలో రైల్వేలైన్ పొడవు	113 కి.మీ
ప్రస్తుతం పూర్తయిన రైల్వే లైన్	63 కి.మీ
రైల్వే లైన్ ఏర్పాటు చేసేమార్గం	రాయదుర్గం, కళ్యాణదుర్గం, కంబదూరు, పావగడ, మడకశిర, మిడిగేశి, మధుగిరి, కొరటగెరె, తుమకూరు

63 కిలోమీటర్ల రైల్వే లైన్ మాత్రమే పూర్తి..

రాయదుర్గం–తుమకూరు రైల్వే లైన్ పొడవు 207 కిలోమీటర్లు. ఇప్పటివరకూ 63 కిలోమీటర్ల రైల్వే లైన్ పనులు మాత్రమే పూర్తయ్యాయి. దీంతో అధికారులు రాయదుర్గం నుంచి కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని కదిరిదేవరపల్లి వరకు ప్యాసింజర్ రైలును నడుపుతున్నారు. ఇంకా 144 కిలోమీటర్ల పనులు జరగాల్సి ఉంది. ప్రస్తుతం పావగడ–మడకశిర మధ్య రైల్వే లైన్ పనులు జరుగుతున్నాయి. మడకశిర నుంచి తుమకూరు మధ్య పనులు ప్రారంభం కాలేదు.

వైఎస్ జగన్ హయాంలోనే భూసేకరణ పూర్తి..

మడకశిర నియోజకవర్గంలో రైల్వే లైన్ నిర్మాణానికి ఎలాంటి అడ్డంకులు రాకుండా గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చొరవ తీసుకున్నారు. ముఖ్యంగా పావగడ–మడకశిర మధ్య దాదాపు 22 కిలోమీటర్ల పొడవున రైల్వే లైన్ నిర్మాణం కోసం అవసరమైన భూసేకరణ ప్రక్రియను పూర్తి చేశారు. అంతేకాకుండా భూములు కోల్పోయిన రైతులకు నష్ట పరిహారం కూడా వెంటనే చెల్లించారు. దీంతో ప్రస్తుతం మడకశిర ప్రాంతంలో రైల్వేలైన్ పనులు వేగంగా జరుగుతున్నాయి.

భూసేకరణకు చొరవ చూపని చంద్రబాబు..

చంద్రబాబు 2014 నుంచి 2019 వరకు ముఖ్యమంత్రిగా ఉన్నారు. అయితే ఆ మధ్య కాలంలో రైల్వే లైన్ నిర్మాణానికి ఏ మాత్రమూ చొరవ చూపలేదు. ముఖ్యంగా మడకశిరలో భూసేకరణ చేయకుండా నిర్లక్ష్యం చేశారు. దీంతో అప్పట్లో మడకశిర ప్రాంతంలో రైల్వే లైన్ పనులు ప్రారంభం కాలేదు. 2019లో వైఎస్ జగన్ సీఎం కాగానే రైల్వే లైన్ నిర్మాణానికి అడుగులు పడ్డాయి. భూసేకరణ పూర్తి కావడంతో ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి.

పట్టించుకోని కర్ణాటక సర్కార్..

రాయదుర్గం–తుమకూరు రైలు మార్గాన్ని కర్ణాటక ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో రైల్వే లైన్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియ కర్ణాటకలో ఇంకా పూర్తి కాలేదు. ప్రస్తుతం మడకశిర వరకు భూసేకరణ పూర్తి కావడంతో పనులు జరుగుతున్నాయి. కానీ మడకశిర నియోజకవర్గానికి ఆనుకుని ఉన్న కర్ణాటక సరిహద్దు నుంచి భూసేకరణ ప్రక్రియ ముందుకు సాగడం లేదు. ముఖ్యంగా మధుగిరి, కొరటగెరె ప్రాంతాల్లో భూసేకరణ జరగకపోవడంతో రైల్వే నిర్మాణంలో జాప్యం జరుగుతోంది. మధుగిరి నియోజకవర్గానికి మంత్రి రాజన్న, కొరటగెరె నియోజకవర్గానికి ఉప ముఖ్యమంత్రి పరమేశ్వర్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరు చొరవ తీసుకుని రైల్వే లైన్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణను పూర్తి చేయాలని రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రజలు కోరుతున్నారు. ఈ రైల్వే లైన్ నిర్మాణం పూర్తయితే రెండు రాష్ట్రాల మధ్య మరింత కనెక్టివిటీ పెరుగుతుంది. ప్రధానంగా సరిహద్దు నియోజకవర్గాలకు బెంగళూరు నగరంతో మరింత అనుసంధానం ఏర్పడి ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ఈ రైల్వే లైన్ నిర్మాణం ఎంతో దోహదం చేస్తుందంటున్నారు. ఈ క్రమంలోనే శనివారం మడకశిరకు విచ్చేస్తున్న కేంద్ర రైల్వే, జలవనరుల శాఖ సహాయ మంత్రి సోమన్నను కలిసి రాయదుర్గం–తుమకూరు రైల్వే లైన్ పనుల గురించి ప్రస్తావించేందుకు ఇక్కడి నేతలు సిద్ధమయ్యారు.

మంత్రి చొరవ తీసుకోవాలి



రాయదుర్గం–తుమకూరు రైల్వే లైన్ నిర్మాణం సరిహద్దు ప్రజల ఆర్థిక అభివృద్ధికి ఎంతగానో దోహదం చేస్తుంది. ఇప్పటికే ఈ రైల్వే లైన్ నిర్మాణంలో తీవ్ర జాప్యం జరిగింది. కేంద్ర రైల్వే సహాయ మంత్రి సోమన్న ప్రత్యేక చొరవ తీసుకోవాలి. రైల్వే లైన్ పనులను పూర్తి చేసి ఈ ప్రాంత అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందించాలి.

– ఆనంద రంగారెడ్డి, ఏడీసీసీ బ్యాంక్ మాజీ ఉపాధ్యక్షుడు, మడకశిర

అభివృద్ధికి సహకరించాలి



మడకశిర నియోజకవర్గ అభివృద్ధికి రైల్వే లైన్ ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇందుకు కేంద్ర మంత్రి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. మడకశిర ప్రాంతంలో రైల్వేలైన్ నిర్మాణానికి సీఎంగా ఉన్నప్పుడు వైఎస్‌జగన్ పూర్తి స్థాయిలో సహకారం అందించారు. భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసి పనులకు ఆటంకాలు కలగకుండా చర్యలు తీసుకున్నారు.

– ఈరలక్కప్ప, వైఎస్సార్ సీపీ సమన్వయకర్త, మడకశిర

సత్యసాయి ఆశయ సాధనే లక్ష్యం కావాలి



సర్వధర్మ ప్రార్థనలు చేస్తున్న సత్యసాయి యూత్ సభ్యులు



నాటికలో శ్రీరాముని చెంత శబరి సేవలు



ప్రసంగిస్తున్న ఆర్‌జే రత్నాకర్ రాజు

- గ్లోబల్ యూత్ సదస్సులో ఆర్‌జే రత్నాకర్ రాజు

ప్రశాంతి నిలయం: సత్యసాయి ఆశయ సాధనే లక్ష్యంగా యువత పనిచేయాలని సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు పిలుపునిచ్చారు. అందరినీ సేవించు..అందరినీ ప్రేమించు అంటూ ప్రపంచ వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు చేపట్టిన సత్యసాయి స్ఫూర్తితో సమస్త మానవాళికి సత్య ధర్మ బోధన, అభాగ్యులకు ఆపన్న హస్తం అందించాలన్నారు. ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి గ్లోబల్ యూత్ సదస్సు శుక్రవారం ఉదయం ఘనంగా ప్రారంభమైంది. సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు, సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ చైర్మన్ చక్రవర్తి, వైస్ చైర్మన్ నిమీష్ పాండే, ట్రస్ట్ సభ్యుడు నాగానంద తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ విభాగంలోని 24 దేశాల నుంచి విచ్చేసిన యువతీ, యువకులు వేద పఠనం చేస్తూ సత్యసాయి మహాసమాధి చెంతకు చేరుకున్నారు. అనంతరం సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. సత్యసాయిని కీర్తిస్తూ భక్తి గీతాలు ఆలపించారు. అనంతరం 'రీ కనెక్ట్, రీచార్జ్, రీజాయిస్' అన్న నినాదంతో ఏర్పాటు చేసిన సదస్సులో ఆర్‌జే రత్నాకర్ రాజు మాట్లాడారు. సమ సమాజ స్థాపనకు సత్యసాయి ఎంతో కృషి చేశారన్నారు. సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్‌లోని యువత సత్యసాయి ఆశయాలను క్షేత్రస్థాయికి తీసుకువెళ్లి సమాజ స్థితిగతులను మార్చే లక్ష్యంతో పనిచేయాలన్నారు. అనంతరం సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ వైస్ చైర్మన్ నిమిష్ పాండే, ట్రస్ట్ సభ్యుడు నాగానంద, పలువురు సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ ప్రతినిధులు సత్యసాయి ఆశయాలు, లక్ష్యాలు, యువత పాత్రను వివరిస్తూ ప్రసంగించారు. అనంతరం సత్యసాయి ఇండోర్ స్టేడియంలో జరిగిన గ్లోబల్ కౌన్సిల్ సదస్సులోనూ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ప్రతినిధులు, గ్లోబల్ కౌన్సిల్ ప్రతినిధులు యువతీ, యువకులను ఉద్దేశించి ప్రసంగించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

సత్యసాయి గ్లోబల్ యూత్ సదస్సుకు విచ్చేసిన వివిధ దేశాల ప్రతినిధులు సాయంత్రం సత్యసాయి మహాసమాధి చెంత నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. 'మోకో కహాన్ దూండే రే బాండే' పేరుతో ప్రదర్శించిన నాటిక భక్తులను కట్టిపడేసింది. ప్రధానంగా వివేకానందుని అనుభవాలను, శ్రీకృష్ణుడు యుద్ధభూమిలో అర్జునునికి చేసిన గీతోపదేశం, శ్రీరామునిపై శబరి చూపిన అచంచలమైన భక్తి విశ్వాసాలను వివరిస్తూ సాగిన నాటకం ఆకట్టుకుంది.

'డిజిటల్' బోధనతో విద్యార్థికి మేలు



చిలమత్తూరు కస్తూర్బా పాఠశాలలో డిజిటల్ తరగతులను పరిశీలిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్



కిచెన్‌లో వంట సరుకులను పరిశీలిస్తున్న కలెక్టర్ చేతన్

- కలెక్టర్ టీఎస్ చేతన్

చిలమత్తూరు: డిజిటల్ విధానంలో బోధించడం వల్ల విద్యార్థులకు సంబంధిత సబ్జెక్ట్‌పై పూర్తిస్థాయి అవగాహన ఏర్పడుతుందని, తద్వారా వారికి ఎంతో మేలు జరుగుతుందని కలెక్టర్ టీఎస్ చేతన్ అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిజిటల్ తరగతులను పరిశీలించారు. స్వయంగా పదో తరగతి విద్యార్థినులకు ఫెడరలిజమ్ గురించి బోధించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను కార్పొరేట్ స్కూళ్ల వారికి దీటుగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఉపాధ్యాయుడూ పనిచేయాలన్నారు. ప్రభుత్వం విద్యారంగానికి రూ.కోట్లు ఖర్చు చేసి అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకుని నాణ్యమైన విద్య అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందించాలని ఎస్‌ఓను ఆదేశించారు. అనంతరం ఆయన కిచెన్ స్టోర్‌కు వెళ్లి వంట సరుకులు, చిక్కీలు, కోడిగుడ్ల నాణ్యతను పరిశీలించారు. కలెక్టర్ వెంట సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, తహసీల్దార్ భాగ్యలత, ఎస్‌ఓ సునీతా కుమార్ తదితరులు ఉన్నారు.

ఆందోళనలో అధ్యాపకులు

- జూనియర్ లెక్చరర్ల 'రెన్యూవల్'లో సందిగ్ధం
- నెలన్నరవుతున్నా రెన్యూవల్ పట్టని ప్రభుత్వం
- మే, జూన్ జీతాలు మంజూరు కాలేదంటూ గగ్గోలు
- ప్రభుత్వ నిర్ణయం కోసం ఉమ్మడి జిల్లాలో 410 మంది ఎదురు చూపు
- గత ప్రభుత్వంలో స్వల్ప విరామంతో రెన్యూవల్...12 నెలల పాటు జీతాలు చెల్లింపు



మే నుంచి పని చేస్తున్నా...

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్ల 2023–24 విద్యా సంవత్సరం కాల పరిమితి ఏప్రిల్ నాటికి పూర్తయింది. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి 'రెన్యూవల్' చేయాల్సి ఉంది. రాష్ట్రంలో కొలువుదీరిన కూటమి ప్రభుత్వం దీని గురించి పట్టించుకోలేదు. రెన్యూవల్ ఉత్తర్వులు వస్తేనే వీరికి జీతాల బిల్లులు పెట్టేందుకు అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. వేసవి సెలవుల్లోనూ లెక్చరర్లతో పని చేయించుకున్నారు. కళాశాలల పునఃప్రారంభమైనప్పటి నుంచి యథావిధిగా విధులు నిర్వర్తిస్తున్నారు. రెన్యూవల్ విషయంలో మాత్రం నోరు మెదపడం లేదంటూ కాంట్రాక్టు లెక్చరర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీతాలు అందకపోవడంతో కుటుంబాల నిర్వహణ చాలా ఇబ్బందిగా మారిందని వాపోతున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా 43 ప్రభుత్వ జూనియర్ కళాశాలలున్నాయి. వీటి పరిధిలో 410 మంది కాంట్రాక్ట్ అధ్యాపకులు పని చేస్తున్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకులు ఈసారి మేలో ఎన్నికల విధుల్లో పాల్గొన్నారు. తర్వాత ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల విధులు, ఆ తర్వాత ఆన్‌లైన్ మూల్యాంకనం విధులూ చేపట్టారు. 2024–25 సంవత్సరానికి సంబంధించి విద్యార్థుల అడ్మిషన్ల డ్రైవ్ కూడా నిర్వహించారు. జూన్ 1 నుంచి కళాశాలలు పునఃప్రారంభమయ్యాయి. ఆ రోజు నుంచి కళాశాలల్లో తరగతులు బోధిస్తున్నారు. మే, జూన్ రెండు నెలలూ పూర్తిగా పని చేశారు. కానీ ఇప్పటిదాకా జీతాలు మంజూరు చేయలేదు.

చంద్రబాబు జీఓ ఇచ్చారు... జగన్ అమలు చేశారు

2019 జనవరిలో అప్పటి సీఎం చంద్రబాబు కాంట్రాక్ట్ లెక్చరర్లకు రూ.27 వేల నుంచి రూ. 37,100కు పెంచారు. అయితే ఏప్రిల్ నుంచి అమలయ్యేలా జీఓ ఇచ్చారు. తర్వాత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగానే జీతాల పెంపు జీఓను అమలు చేశారు. తర్వాత మూడేళ్ల కిందట పీఆర్సీ ఇచ్చిన సమయంలో ఏకంగా రూ. 57,100 వేతనం చేశారు.

కాంట్రాక్ట్ లెక్చరర్లపై కక్షసాధింపు

గత ప్రభుత్వంలో తమకు మేలు జరిగే నిర్ణయాలు తీసుకోవడంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోలకు కాంట్రాక్ట్ లెక్చరర్లు క్షీరాభిషేకాలు చేశారు. కాంట్రాక్ట్ లెక్చరర్లందరూ జగన్‌కు మద్దతుగా ఉన్నారనే కారణంగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలు చేపడుతోందని వాపోతున్నారు. అప్పటి సీఎం మేలు చేసిన కారణంగానే క్షీరాభిషేకాలు చేశామని, ఈ ప్రభుత్వం కూడా మంచి చేసే పనులు చేపడితే కచ్చితంగా నెత్తిన పెట్టుకుంటామని కాంట్రాక్ట్ లెక్చరర్లు చెబుతున్నారు.

ఇబ్బందిగా ఉంది



రెండు నెలలుగా జీతాల రాక చాలా ఇబ్బందులు పడుతున్నాం. మే, జూన్ నెలంతా పని చేశాం. రెన్యూవల్ కాకపోవడంతో జీతాలు బిల్లు చేయడానికి వీలు కాదు. కుటుంబాల నిర్వహణ ఇబ్బందిగా మారింది. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా బోధన సాగిస్తున్నాం. ప్రభుత్వం స్పందించి వెంటనే రెన్యూవల్ చేసి జీతాలు మంజూరయ్యేలా చూడాలి.

– పీఎస్ అక్బర్‌బాషా, కాంట్రాక్ట్ లెక్చరర్స్ జేఏసీ నాయకుడు

'రెగ్యులర్' ఉత్తర్వులు ఇవ్వాలి



గత ప్రభుత్వ హయాంలో చట్ట ప్రకారం కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులర్ చేసేలా చర్యలు తీసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా 3,600 మందికి గాను 1,700 మంది జూనియర్ అధ్యాపకులు 'రెగ్యులర్'కు అర్హత సాధించారు. వారందరికీ వెంటనే క్రమబద్ధీకరణ ఉత్తర్వులు ఇవ్వాలి. ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నాం. అర్హత కల్గిన వారికి వెంటనే రెగ్యులర్ ఉత్తర్వులు ఇచ్చేలా ప్రభుత్వం పరిశీలించాలి.

– కె.నారాయణస్వామి, కాంట్రాక్ట్ అధ్యాపకుడు, జీజేసీ, కొత్తచెరువు

రోగులకు మెరుగైన సేవలు అందించాలి



ప్రభుత్వ ఆస్పత్రిలో ఓపీ వివరాలు, వైద్య సేవలపై ఆరా తీస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

- జిల్లా ఆస్పత్రికి అవసరమైన వైద్య పరికరాలు కొనుగోలు చేయండి
- ఇన్‌చార్జ్ మెడికల్ సూపరింటెండెంట్‌కు కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశం
- హిందూపురంలో ప్రభుత్వ కార్యాలయాల పరిశీలన

హిందూపురం టౌన్: ఎంతో నమ్మకంతో జిల్లా ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ వైద్యులను, హిందూపురం జిల్లా ఆస్పత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డేవిడ్‌రాజ్‌ను ఆదేశించారు. శుక్రవారం హిందూపురంలో పర్యటించిన కలెక్టర్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. నేరుగా ఆరోగ్య మిత్ర హెల్ప్ డెస్క్ వద్దకు వెళ్లి ఓపీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే ఆస్పత్రిలో అన్న క్యాంటీన్ ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డిని ఆదేశించారు. ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఆస్పత్రికి అవసరమైన బెడ్‌షీట్లు, ఆపరేషన్‌కి అవసరమైన వైద్య పరికరాల కొనుగోలుకు అవసరమైన నిధులను ఆస్పత్రి అభివృద్ధి నిధి నుంచి తీసుకోవాలని సూచించారు. అలాగే ఆస్పత్రి అభివృద్ధి కమిటీకి సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేసి పంపాలన్నారు. అంతకుముందు ఆయన పలు ప్రభుత్వ కార్యాలయాలను తనిఖీ చేశారు. తొలుత రెవెన్యూ కార్యాలయానికి వెళ్లిన కలెక్టర్.. కార్యాలయంలోని విభాగాలను, అక్కడి ఉద్యోగుల పనితీరును పరిశీలించారు. ఇక నుంచి అందరూ నూతన రెవెన్యూ కార్యాలయంలో విధులు నిర్వర్తించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం బార్ అసోసియేషన్ నాయకులతో మాట్లాడారు. అనంతరం శిథిలావస్థకు చేరుకున్న కోర్టు భవనాన్ని కలెక్టర్ పరిశీలించారు. శిథిలమైన కోర్టు భవనాలను కూల్చి... వాటి స్థానంలో నూతన భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

ఇసుక విక్రయాలపై టాస్క్‌ఫోర్స్

జిల్లాలో ఉచిత ఇసుక పక్కాగా అమలు చేసేందుకు త్వరలోనే రెవెన్యూ, మైనింగ్, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అవసరమైన వారందరికీ ఇసుక అందేలా చూస్తామన్నారు. ఎవరైన ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనుమతులు లేకుండా నది పరివాహక ప్రాంతాల్లోని ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కలెక్టర్ వెంట సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి, తహసిల్దార్ శివప్రసాద్ రెడ్డి లతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అగ్రిగోల్డ్ భూముల్లో చెట్ల నరికివేత



చెట్లను నరికేస్తున్న దృశ్యం

రొద్దం: మండలంలోని పెద్దగువ్వలపల్లి సమీపంలో ఉన్న అగ్రిగోల్డ్ భూముల్లో ఆ సంస్థ పెంచిన నీలగిరి చెట్లను కొందరు వ్యక్తులు నరికి వేస్తున్నారు. విషయం గమనించిన స్థానికులు కొందరు శుక్రవారం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. పెనుకొండ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి చెట్లను అక్రమంగా నరికి రవాణా చేస్తున్నట్లు సమాచారం. రెవెన్యూ అధికారులు అక్కడకు చేరుకుని చెట్ల నరికి వేతను అడ్డుకున్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



మృతుడు రషీద్‌ఖాన్

తనకల్లు: విద్యుత్ షాక్‌కు గురై ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... తనకల్లు మండలం టి.సదుంకు చెందిన పఠాన్ బాబ్జాన్ టిప్పర్ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం తన కుమారుడు రషీద్‌ఖాన్ (22)తో కలసి టిప్పర్‌లో చీకటిమాని పల్లి వద్ద ఉన్న అంజినప్ప నర్సరీ ఎరువుల ఫ్యాక్టరీ వద్దకు వెళ్లాడు. వాహనాన్ని ఫ్యాక్టరీ వద్ద ఆపి ట్యాంక్‌లో డీజిల్ పోయాలంటూ కుమారుడికి తెలిపి తండ్రి పనిపై పక్కకు వెళ్లాడు. అయితే టిప్పర్ ఆపిన ప్రాంతం ఉపరితలంలో 11కేవీ విద్యుత్ తీగలు ఉన్నాయి. ఈ విషయం గమనించని రషీద్‌ఖాన్ టిప్పర్‌కు డీజిల్ పోసేందుకు లిఫ్ట్ పైకి ఎత్తాడు. దీంతో పైన ఉన్న విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు రషీద్‌ఖాన్‌ను వెంటనే చికిత్స కోసం తనకల్లులోని ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ ధరణీబాబు తెలిపారు. కాగా, కుటుంబానికి ఆసరాగా ఉన్న కుమారుడి మృతితో తల్లిదండ్రులు, బంధువులు విలపించిన తీరు అందరికీ కంటనీరు తెప్పించింది.

నైరుతి నైరాశ్యం

- పొలం దుక్కి చేసి విత్తనం వేసేందుకు సిద్ధమైన రైతులు
- వాన కోసం వేయి కళ్లతో ఎదురుచూపులు
- మేఘాలు కమ్ముకుంటున్నా ఫలితం శూన్యం
- జిల్లా అంతటా తుంపరతోనే సరిపెడుతున్న వైనం

ముందస్తుగా తొలకరి వర్షాలతో పలకరించి ఆశలు రేకెత్తించిన 'నైరుతి'.. చివరకు తీవ్ర నిరాశపరిచింది. దట్టమైన మేఘాలు ఊరిస్తున్నా.. చినుకు జాడ కరువైంది. ముందస్తుతో మురిపించిన వరుణుడు తుంపరతో సరిపెడుతుండగా రైతన్నల పరిస్థితి గందరగోళంగా మారింది. అదనులో పదును కాక 'ఖరీఫ్' పడకేసింది.



పెడపల్లి వద్ద సాగుకు సిద్ధం చేసిన పొలం

పుట్టపర్తి అర్బన్: ఖరీఫ్ కల్లోలంగా మారింది. పంటలసాగుకు కీలకమైన సమయంలో వరుణుడు ముఖం చాటేయడంతో విత్తు కూడా పడని పరిస్థితి నెలకొంది. 20 రోజులుగా మేఘాలు ఊరిస్తున్నా... సరైన వర్షం కురవడం లేదు. కేవలం తుంపర్లతోనే సరిపెడుతోంది. దీంతో రైతులు వాన రాకకోసం ఎదురు చూస్తున్నారు. జూలై సాధారణ వర్షపాతం 63.9 మి.మీ కాగా, ఈ 20 రోజుల్లో సగటున 15.5 మి.మీ వర్షపాతం మాత్రమే నమోదైంది. అందునా కదిరి, నల్లచెరువు మండలాల్లో మాత్రమే చెప్పుకోదగ్గ వర్షం కురిసింది. మిగతా మండలాల్లో సాధారణ వర్షపాతం కూడా నమోదు కాలేదు. ధర్మవరం మండలంలో అయితే 12 రోజులుగా చినుకు జాడ లేదు. జూలై 1వ తేదీ, 6వ తేదీ రెండు రోజులు కొంత మెరుగ్గా వర్షం కురిసినా... పంటల సాగుకు ఉపయోగం లేదని రైతులు చెబుతున్నారు.

ముప్పేట దాడి చేస్తున్న తెగుళ్లు..

ముందస్తు వర్షాలకే విత్తనం వేసిన వారు... బోరు బావుల కింద ఉన్న పొలాల్లో పంట సాగు చేస్తున్న రైతులను తెగుళ్లు భయపెడుతున్నాయి. నిత్యం ఆకాశం మేఘావృతమై ఉంటుండగా పంటలకు ఎండ తగలడం లేదు. దీంతో తెగుళ్లు ముప్పేట దాడి చేస్తున్నాయని రైతులు వాపోతున్నారు. రెండు మూడు పర్యాయాలు మందులు పిచికారీ చేస్తున్నా... పురుగులు చనిపోవడం లేదంటున్నారు. వేరుశనగ, కంది పంటలకు శనగ పచ్చ పురుగు, నల్లచీడ, లద్దె పురుగు, గొంగళి పురుగులు ఆశిస్తున్నాయని దీంతో వేలాది రూపాయలు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇక ప్రత్యామ్నాయమే దిక్కు..

ఖరీఫ్‌లో ప్రధాన పంటలైన వేరుశనగ, కంది, ఆముదం, పత్తి, మొక్కజొన్న తదితర పంటలు విత్తుకునేందుకు జూన్ 15 నుంచి జూలై 15 వరకు మంచి సమయమని అధికారులు, శాస్త్రవేత్తలు తెలిపారు. ప్రస్తుతానికి మంచి అదను దాదాపు ముగుస్తోంది. రైతులకు ఇష్టమైన ఆరుద్ర కార్తె ఈ నెల 6న ముగిసింది. ప్రస్తుతం పునర్వసు కార్తె ఈ నెల 20 వరకు ఉంటుంది. అంతలోపు పంటలు వేసుకుంటే ఇబ్బంది ఉండదని రైతులు భావిస్తారు. ఇప్పుడు వర్షం వచ్చినా మిగిలిన 80 శాతం విస్తీర్ణం సాగులోకి రావడం కష్టంగానే కనిపిస్తోంది. దీంతో ఇక ప్రత్యామ్నాయ పంటలే శరణ్యమనే భావన సర్వత్రా వ్యక్తమవుతోంది. ఆగస్టులో ఎట్టి పరిస్థితుల్లోనూ వేరుశనగ, కంది, ఆముదం, పత్తి లాంటి పంటల సాగు వద్దని అధికారులు చెబుతున్నారు. ఉలవ, పెసర, అలసంద, స్వల్పకాలిక కంది, సజ్జ, కొర్ర లాంటి ప్రత్యామ్నాయంగా సాగు చేయాలని సూచిస్తున్నారు.

నమ్మకం విడిచిపెట్టా

ఇంతవరకూ సరైన వర్షం పడకపోవడంతో పంటల సాగుపై నమ్మకం విడిచిపెట్టా. కుటుంబ పోషణ కోసం మా ఊరు నుంచి గోరంట్లకు వచ్చి చిన్న అంగడి వ్యాపారం ప్రారంభించా. పిల్లలను ఇక్కడే చదివించుకుంటున్నా. ఎవరైనా ముందుకు వస్తే నా పొలం కౌలుకు ఇవ్వాలనుకుంటున్నా. – రాజశేఖర్‌రెడ్డి, దిగువచెర్లోపల్లి

వేచి చూస్తున్నా

నాకున్న నాలుగు ఎకరాలను సాగుకు సిద్ధం చేశా. ఇప్పటి వరకూ సరైన వర్షం కురవక పోవడంతో కంది వేయకుండా ఎదురు చూస్తున్నా. మేఘాలు కమ్ముకుంటున్నా...తుంపరతో సరిపెడుతోంది. వేరుశనగ, కంది విత్తనాలు ఎక్కువ రోజులు నిల్వ చేయడం వల్ల పురుగు, ఊజీలు ఆశిస్తాయని భయమేస్తోంది. – చంద్రశేఖర్, పైపల్లి

బస్సులపై దాడి కేసులో ఇద్దరి అరెస్ట్



నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

చెన్నేకొత్తపల్లి: మండలంలోని ఎన్‌ఎస్ గేట్ సమీపంలో 44వ జాతీయ రహదారి పక్కన బస్సులు ఆపి నిద్రిస్తున్న డ్రైవర్లపై దాడి చేసి, నగదు అపహరించుకెళ్లిన దుండగులను పోలీసులు అరెస్ట్ చేశారు. చెన్నేకొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను రామగిరి సీఐ శివాంజనేయులు వెల్లడించారు. గత నెల 21న హైదరాబాదు నుంచి కేరళకు మూడు కొత్త బస్సులను డ్రైవర్లు తీసుకెళుతున్నారు. ఎన్‌ఎస్‌గేట్ వద్దకు చేరుకోగానే రాత్రి సమయంలో వాహనాలను రోడ్డు పక్కన నిద్రకు ఉపక్రమించారు. అర్ధరాత్రి ముగ్గురు వ్యక్తులు రాళ్లతో దాడి చేసి, డ్రైవర్లను గాయపరిచి, వారి వద్ద నుంచి నగదు అపహరించుకెళ్లారు. ఈ ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో శుక్రవారం తెల్లవారు జామున 44వ జాతీయ రహదారిపై అనుమానస్పదంగా సంచరిస్తున్న ఇద్దరిని గస్తీ తిరుగుతున్న పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో బస్సులపై రాళ్లు రువ్వింది వారేనని తేలింది. దీంతో వారిని స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన వారిలో ధర్మవరం మండలం గొట్లూరుకు చెందిన ఆది ఆంధ్ర జలధార కుమార్, ధర్మవరం మండలం ధర్మపురికి చెందిన ముకుంద ఉన్నారు. జల్సాలకు అలవాటు పడిన వీరు సులువుగా డబ్బు సమకూర్చుకునేందుకు దొంగతనాలకు పాల్పడుతున్నట్లుగా నిర్ధారణ అయింది. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయస్థానం ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. విలేకరుల సమావేశంలో చెన్నేకొత్తపల్లి ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కళాశాల సమస్యలపై కలెక్టర్‌కు నివేదిక

- జిల్లా స్పెషల్ ఆఫీసర్ కృష్ణానాయక్



వంటగదిని పరిశీలిస్తున్న కృష్ణానాయక్

మడకశిర: స్థానిక మహాత్మ జ్యోతిరావు పూలే బాలుర బీసీ జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యలపై నివేదిక సిద్ధం చేసి కలెక్టర్‌కు అందజేయనున్నట్లు జిల్లా స్పెషల్ ఆఫీసర్ కృష్ణానాయక్ తెలిపారు. శుక్రవారం కళాశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. వంట గదిలో శుభ్రత పరిశీలించారు. భోజన నాణ్యతపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో సమావేశమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం కళాశాల నిర్వహిస్తున్న భవనం చాలా ఇరుకుగా ఉందని ఈ సందర్భంగా ఆయన దృష్టికి విద్యార్థులు తీసుకెళ్లారు. గుండుమలలో నిర్మిస్తున్న కళాశాల భవనాలను వెంటనే పూర్తి చేసి ప్రారంభించేలా చొరవ తీసుకోవాలని కోరారు. సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని విద్యార్థులకు ఆయన భరోసానిచ్చారు. చదువు తప్ప మరో అంశంపై దృష్టి సారించకుండా ఉత్తమ ఫలితాలు సాధించి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఆయన వెంట ఎంఈఓలు భాస్కర్, నరసింహమూర్తి ఉన్నారు.

చేనేతల సంక్షేమానికి కృషి

- రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత



మాట్లాడుతున్న మంత్రి సవిత

సోమందేపల్లి: చేనేతల సంక్షేమానికి కృషి చేస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత అన్నారు. శుక్రవారం స్థానిక లక్ష్మీ వెంకటేశ్వర కల్యాణ మండపంలో జరిగిన చేనేత ఆత్మీయ సదస్సుకు మంత్రి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ముడి సరుకుల కొనుగోలుకు సబ్సిడీ ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అర్హులైన చేనేతలకు ముద్ర రుణాలు, పింఛన్ అందేలా చూస్తామన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌తోపాటు స్థానికంగా మరో బ్యాంకు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం చేనేత కార్మిక సంఘాల నాయకులు మంత్రిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో చేనేత సంఘం నాయకులు శంకర్, తుమకుంట వెంకటరాముడు, రామాంజి, వెంకటేష్, గోవిందు, శివప్ప తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని మంత్రి సవిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నేరుగా తరగతి గదుల్లోకి వెళ్లి ఉపాధ్యాయులు బోధనా తీరు, మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మంత్రి వెంట ఎంఈఓ ఆంజనేయులు నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గురుకులాల్లో మిగులు సీట్లకు 16న కౌన్సెలింగ్

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలోని అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో 2024–25 విద్యా సంవత్సరం ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సర ప్రవేశాలకు సంబంధించి మిగులు సీట్ల భర్తీకి ఈ నెల 16న నార్పల మండలం బి.పప్పూరు గురుకుల పాఠశాలలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు గురుకుల పాఠశాలలు, కళాశాలల జిల్లా కోఆర్డినేటర్ అంగడి మురళీకృష్ణ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. బీఆర్‌ఏజీ సెట్–2024లో చూపిన ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. బాలుర కళాశాలల్లో 41, బాలికల కళాశాలల్లో 140 ఖాళీలను భర్తీ చేయనున్నట్లు తెలిపారు.

'వక్క'లో యాజమాన్య పద్ధతులు పాటించండి

- జిల్లా ఉద్యాన శాఖ అధికారి జి.చంద్రశేఖర్

రొళ్ల: వక్క తోటల్లో యాజమాన్య పద్ధతులు పాటించాలని రైతులకు జిల్లా ఉద్యాన శాఖాధికారి జి.చంద్రశేఖర్ సూచించారు. శుక్రవారం రొళ్ల, అగళి మండలాల్లోని వివిధ గ్రామాల్లో రైతులు సాగు చేసిన వక్కతోటలను ఆయన పరిశీలించి, మాట్లాడారు. మడకశిర నియోజకవర్గం వ్యాప్తంగా ఐదు మండలాల్లో దాదాపు 1,400 హెక్టార్లలో వక్క సాగులో ఉందన్నారు. ఏటా హెక్టారుకు రూ.8.50 లక్షలు చొప్పున రూ.119 కోట్ల వరకు ఆదాయాన్ని రైతులు గడిస్తున్నట్లుగా అంచనాలు ఉన్నాయన్నారు. ఈ క్రమంలో కొత్తగా వక్కసాగు చేపట్టాలనుకునే రైతులు నాణ్యనమైన రోగ రహిత మొక్కలను ఎంచుకోవాలన్నారు. మొక్కకూ మొక్కకు మధ్య 10 అడుగుల దూరం ఉండాలన్నారు. మొక్క నాటిన రెండేళ్ల తర్వాత కాండముపై సున్నం పూస్తే ఎండు ముఖం పట్టకుండా ఉంటుందన్నారు. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో అధిక ఉష్ణోగ్రతలు ఉంటాయని, దీంతో మొక్కల మధ్య అవిశ మొక్కలు నాటుకుంటే వేడి తీవ్రత నుంచి వక్క మొక్కలను కాపాడుకోవచ్చునన్నారు. మొక్కలు ఏపుగా పెరిగేందుకు 10 గ్రాముల పోషకాలతో పాటు 5 గ్రాముల క్యాల్షియం నైట్రేట్‌ను ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. తెల్లదోమ, అగ్గితెగులు నివారణకు 2.5 గ్రాముల సీఓసీ, 2 ఎంఎల్ డైక్లోర్వేస్ ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. కాయలు బలంగా ఉన్నప్పుడు మాత్రమే కోయాలన్నారు. మృదువుగా ఉన్నప్పుడు కాయలు కోయడం వల్ల ఎండ బెట్టినప్పుడు బరువు తగ్గే అవకాశం ఉంటుందన్నారు. అలాగే కాయ వలిచే సమయంలో వేడి నీటిలో మరిగించి ఎరుపు రంగు వచ్చినప్పుడు తీయాలన్నారు. అనంతరం వారం రోజు పాటు ఎండలో తేమశాతం లేకుండా పూర్తిగా ఆర బెట్టాలన్నారు. ఎండిన కాయలు సుమారు రెండేళ్ల వరకూ భద్ర పరచి అధిక ధరలు ఉన్నప్పుడు విక్రయించుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రజా శ్రేయస్సుకు విఘాతంగా నూతన క్రిమినల్ చట్టాలు



మాట్లాడుతున్న ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు సుంకర రాజేంద్ర ప్రసాద్



హాజరైన న్యాయవాదులు

అనంతపురం: కేంద్ర ప్రభుత్వం కొత్తగా అమల్లోకి తెచ్చిన నూతన క్రిమినల్ చట్టాలు ప్రజా శ్రేయస్సుకు విఘాతం కలిగించేలా ఉన్నాయని ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు సుంకర రాజేంద్ర ప్రసాద్ ఆందోళన వ్యక్తం చేశారు. నూతన చట్టాలపై ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) అనంతపురం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సుంకర రాజేంద్ర ప్రసాద్‌తో పాటు ఆల్ ఇండియా బార్ కౌన్సిల్ సభ్యుడు ఆలూరి రామిరెడ్డి, అనంతపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గురుప్రసాద్ మాట్లాడారు. పౌర సమాజం శ్రేయస్సు దృష్ట్యా నూతన క్రిమినల్ చట్టాలపై న్యాయవాదులు లోతైన పరిశీలన చేయాల్సిన అవసరం ఉందన్నారు. బెయిల్ మంజూరులో మార్గదర్శకాలు, పోలీసు అధికారులను ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్‌లుగా పరిగణించడం చూస్తుంటే జ్యుడీషియరీ అధికారాలు నియంత్రించేలా నూతన చట్టాలు ఉన్నాయన్నారు. దీంతో న్యాయవాదులు పెను సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. చట్టాలు రూపొందించిన ప్రక్రియ హేతుబద్ధంగా లేదన్నారు. శాస్త్రీయమైన చర్చ లేకుండా రూపొందించిన చట్టాల వల్ల పౌర సమాజానికి ఎలాంటి ఉపయోగం ఉండదన్నారు. ప్రజాస్వామ్య హక్కులను హరించడానికి పాలకులకు ఈ చట్టాలు ఉపయోగపడతాయనే విషయాన్ని గుర్తించాలన్నారు. న్యాయవాదులు ఈ చట్టాన్ని కూలంకషంగా చదివి, పరిశీలించి, అవగాహన చేసుకున్న తర్వాత ప్రమాదకరమైన అంశాలను తొలగించడానికి లేదా సవరించడానికి ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ విషయంగా ఇప్పటికే ఇప్పటికే దేశ వ్యాప్తంగా పలు చోట్ల న్యాయవాదులు, ప్రజలు, రాజకీయ పార్టీలు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఐలు జిల్లా ప్రధాన కార్యదర్శి సతీష్, జిల్లా అధ్యక్షుడు వీరు యాదవ్, రాష్ట్ర కమిటీ సభ్యులు సూర్యచంద్ర, జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసాద్ ప్రకాష్ పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

● అధినేతతో భేటీ



వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో ఆ పార్టీ మాజీ మంత్రి మాలగుండ్ల శంకరనారాయణ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. – పుట్టపర్తి

బాబయ్య దర్గాను సందర్శించిన ఎస్పీ



దర్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పెనుకొండ: పవిత్ర బాబయ్య దర్గాను కుటుంబసభ్యులతో కలసి ఎస్పీ మాధవరెడ్డి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు దర్గా మర్యాదలతో నిర్వాహకులు, మత పెద్దలు, ముజావర్లు స్వాగతం పలికారు. తలపై మోసుకు వచ్చిన చాదర్ గల్ఫ్‌ను ఎస్పీ సమర్పించారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం బాబయ్య స్వామి మహిమ, దర్గా విశిష్టతను నిర్వాహకులు వివరించారు. అనంతరం గగన్‌మహల్, కాశీ విశ్వేశ్వరాలయం ఇతర చారిత్రక కట్టడాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ వెంట సీఐ సుబ్బరాయుడు, ఎస్‌ఐ రంగడు, సిబ్బంది ఉన్నారు.

వ్యక్తి ఆత్మహత్య



సుధాకర్ (ఫైల్)

ముదిగుబ్బ: అప్పులు తీర్చే మార్గం కానరాక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... ముదిగుబ్బకు చెందిన సుధాకర్ (40), హరిత దంపతులు తోపుడు బండిపై కూరగాయలు అమ్ముతూ జీవనం సాగించేవారు. వీరికి ఒక్కగానొక్క కుమార్తెకు ఇటీవల పెళ్లి చేశారు. పెళ్లి ఖర్చులు, ఇతర అవసరాల కోసం ప్రైవేట్ వ్యక్తుల అప్పులు చేశారు. ఈ క్రమంలో కూరగాయల ధరలు ఆకాశానికి అంటడంతో వ్యాపారం సన్నగిల్లింది. చేసిన అప్పులకు వడ్డీల భారం పెరుగుతూ వచ్చింది. దీంతో అప్పుల ఎలా తీర్చాలో తెలియక రోజూ మదనపడేవాడు. ఈ క్రమంలో శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని ఫ్యాన్‌కు సుధాకర్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

కర్ణాటక మద్యం పట్టివేత



మద్యాన్ని చూపుతున్న సెబ్ అధికారులు

హిందూపురం అర్బన్: జిల్లాలోకి అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని సెబ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలను సెబ్ సీఐ రాజశేఖరగౌడ్ వెల్లడించారు. ముందస్తు సమాచారంతో అప్రమత్తమైన సెబ్ ఎస్‌ఐ కమలాకర్, సిబ్బంది హిందూపురం మండలంలోని పోచనపల్లి బ్రిడ్జి వద్ద శుక్రవారం ఉదయం వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన ద్విచక్రవాహనాన్ని ఆపి తనిఖీ చేస్తే 12 బాక్సుల్లో 1,152 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యం బయటపడింది. మద్యాన్ని స్వాధీనం చేసుకుని ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశారు. మద్యం తరలిస్తున్న హిందూపురానికి చెందిన ఖలీల్‌ను అరెస్ట్ చేశారు. పట్టుబడిన మద్యం విలువ రూ.50 వేలు ఉంటుందని సెబ్ అధికారులు తెలిపారు.

రామగిరిలో ఆగని టీడీపీ దుశ్చర్యలు



రాళ్లు వేసిన బోరుబావిని చూపుతున్న బాధిత రైతు

రామగిరి: ఎన్నికల ఫలితాల రోజు నుంచీ టీడీపీ నేతలు రెచ్చిపోతున్నారు. అధికారం అండతో సామాన్యులను తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారు. వైఎస్సార్ సీపీ నేతలను లక్ష్యంగా చేసుకుని భౌతిక దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. తాజాగా గురువారం రాత్రి మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన గొల్ల నారాయణ బోరు బావిలోకి రాళ్లు వేసి పూడ్చి వేశారు. గొల్ల నారాయణ తనకున్న నాలుగు ఎకరాల్లో ప్రస్తుతం జొన్న సాగు చేస్తున్నారు. రెండు రోజుల క్రితం బోరు మోటరు చెడిపోవడంతో మరమ్మతు కోసం మెకానిక్ వద్దకు తీసుకెళ్లాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి కొందరు వ్యక్తులు బోరుమోటరును పెకలించి పైపుల్లోకి రాళ్లు వేసి పూడ్చేశారు. రాజకీయ కక్షతో టీడీపీ నేతలే దుశ్చర్యకు పాల్పడినట్లు బాధిత రైతు చెబుతున్నారు. పంట సాగులో ఉండగా ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడితే తమ కుటుంబం జీవనం ఎలా సాగించాలని బాధిత రైతు వాపోయాడు.